# ముగింపు మీరే చెప్పండి!

పోలకంపల్లి శాంతాదేవి

రేపే దీపావళి భోగి పండగ.

శ్యామలకి అప్రియంగా, అలజడిగా ఉంది.

తన పెళ్ళయాక వచ్చిన తొలి దీపావళి ఇది. తనని కొత్తల్లుడిని తీసికెళ్ళడానికి పుట్టింటివాళ్ళెవరూ ఇంత వరకు దిగలేదు. వాళ్ళకు ఆర్థికమైన ఇబ్బందులలో ఏవోఉండి రాకపోతే, ఇక్కడ తన అత్తగారూ, భర్త ఎంత హేళనైనా చేస్తారు. ఎన్ని మాటలైనా అంటారు. వాళ్ళ ఇబ్బందులు వాళ్ళ కష్టాలు ఏముంటేనేం? వెళ్ళనే మాటలు వీళ్ళు అంటారు. వాళ్ళ ఒక్కోమాటకు తన ప్రాణం పోతున్నట్టు అవుతుంది.

పెళ్ళిలో మర్యాదలు సరిగా జరగలేదని లాంఛనాలు అనుకొన్నట్టుగా ఇవ్వలేదని, పెళ్ళి జరిగి ఆరునెలలైనా ఇప్పటికీ నిత్య నూతనంగా చెప్తూనే ఉంటారు.

"మీ కోడల్ని తీసుకుపోవడానికి పుట్టింటి వాళ్ళెవరూ రావట్లేదేంటే?" ఇరుగు పొరుగుల మధ్య పుల్లలు పెట్టే సరదాగల రాధమ్మ అంది.

ఒక్కటి అందిస్తే చాలు వంద వరకు దండకం అల్లేయగలిగిన శ్యామల అత్తగారు తాయారమ్మ చెప్పడం తిప్పుతూ మొదలు పెట్టింది. "పెళ్ళి చేసి అత్తవారింటికి పంపి ఆరునెలలైంది తీసికెళ్ళకపోతే మానేసిరి. పిల్లఎలా ఉందో ఒక్కసారైనా చూసిపోవడానికి రాలేదు వాళ్ళది అదో రకం తీరులే. వాళ్ళు అందరిలాంటి మనుషులు కారని పెళ్ళిలోనే తెలిసిపోయింది. వాళ్ళ మర్యాదలూ, వాళ్ళ ఇదీ. ఇహ కూతుర్ని అల్లుడినీ పండక్కి ఏం పిలుసుకుపోతారులే! ఇంతకీ మావాడి అదృష్టం అలా ఉంది మరి. ఏదైనా అవసరం వస్తే ఆదుకొనే అత్తగారు రాకపోయినా, కనీసం జరుప వలసిన లాంఛనాలైనా జరిపేట్టు లేరు! మొదటి పండక్కే ఇలాఉంది మరి. ఇహ ఏ పండక్కి పిలుస్తారని. ఏం మర్యాదలు చేస్తారని?"

సరిగా మాటల్లోనే వచ్చాడు శ్యామల తమ్ముడు.

మంగ తాయారమ్మ నోరు టక్కున మూతపడింది.

తమ్ముడికి టీ చేసిచ్చే నెపంమీద లోపలికి తీసికెళ్ళి, "నాన్న వస్తాడని అనుకోలేదు గాని, ఎవరినైనా పంపిస్తాడని మొన్నటి నుండి ఎదురు చూస్తున్నానురా. మీరెవరూ నన్ను పండక్కి తీసికెళ్ళడానికి రాలేదని మా అత్తగారు అప్పుడే దెప్పేనలు ప్రారంభించింది."

"మొన్నే వచ్చేవాడిని అక్కా.. షావుకారు డబ్బివ్వలేదు. వడ్లు ఒప్పందం చేసి ఇవాళ నాన్న డబ్బు తెచ్చాడు. నిన్నూ, బావనూ రాత్రిరైలుకు వచ్చెయ్యమన్నాడు.

కూతుర్నీ అల్లుడిని పండక్కి పిలుచుకోడానికి తండ్రి వడ్లు ఒప్పందం చేశాడని విని శ్యామల మనసు గిలగిల్లాడినట్టయింది ఖర్చులూ, పన్నులూ, కూలీబోలూ పోగా ఇంటికి వచ్చే వడ్లే ఓ ఏభై బస్తాలు. అవే పిల్లల చదువులకు, ఆడపిల్లల పెళ్ళిళ్ళకు పురిటి ఖర్చులకూ, మగపిల్లల చదువులకూ, తిండికీ, రోగాలకూ సర్దాలి. అలాంటిది ముందుగానే వడ్లు ఒప్పందం చేసే డబ్బు తెచ్చుకొంటే ఇంటికి వచ్చే ధాన్యమెంత?

"అమ్మ బాగుందా? చిన్న తమ్ముడు అల్లరి అలాగే చేస్తున్నాడా?"

"నువ్వొస్తున్నావుగా!"

"ఏమిటో ఆత్రంరా! ఆరునెలలైందా అందరినీ చూసి!" కళ్ళు చెమ్మగిల్లుతుండగా అంది.

అత్తగారు వెంచేసింది. "పండక్కి వారంరోజుల ముందు తీసికెళ్ళకూడదు అక్కయ్యను? ముందుగా వస్తే మీసొమ్ము తిని పోతుందనా?"

ఆవిడ ధోరణికి బిక్కముఖం వేశాడు శ్యామల తమ్ముడు.

"పండక్కి మీ అక్కకీ, బావకీ బట్టలు తీసుకొన్నారు?"

"నాకు తెలియదండీ."

"మీ అక్కనీ బావనీ మాత్రమే రమ్మన్నారా?"

"నాకు తెలియదండీ!"

"ఓహో! అన్నిటికీ తెలియదనమని చెప్పిపంపారన్నమాట మీవాళ్ళు"

ట్రెయిన్‌కు ఫస్ట్‌క్లాస్ టికెట్ తీయమ్మని చెప్పడంతో మొదలుపెట్టాడు! అల్లుడి హోదా ప్రదర్శించడం, శ్యామల భర్త వేణుగోపాలరావు.

మళ్ళీ బిక్కముఖం వేశాడు శ్యామల తమ్ముడు. "నాన్న సరిగా పాతిక రూపాయలిచ్చాడే. ఫస్ట్‌క్లాస్ టికెట్‌కు చాలవు"

"నేనిస్తానురా! నాన్న నేనొచ్చేటప్పుడు ఇచ్చిన డబ్బు నేను దేనికి ఖర్చు పెట్టలేదు, ఆయన చెప్పినట్టు వినకపోతే మళ్ళీ గొడవ చేస్తారు. కాస్తదానికి ఆయనతో పేచీ ఎందుకు?" ఎవరూ చూడకుండా శ్యామల డబ్బు తీసిచ్చింది తమ్ముడికి

తయారై బయల్దేరేముందు పదే పదే చెప్పిందే మళ్ళీ చెప్పిందిగా అత్తగారు. "అలకపాన్పుమీద పెళ్ళిలో ఇస్తానన్న టేప్‌రికార్డర్ తీసుకొనిరావాలి చూడు. ఖాళీ చేతులతో ఊగుతూ వచ్చావంటే మళ్ళీ



దగా ఉండదు చూడు. తరువాత అత్త ముండ మంచిది కాదనద్దు."

పండగకోసం చేసిన జంతికలూ, కజ్జికాయలూ ప్లేట్‌లో పెట్టి తెచ్చాడు శ్యామల అన్నగారు: బావగారికోసం. "గేదెలూ, ఎద్దులూ దవడలాడించినట్టుగా ఎవరు తింటారోయ్. ఈ కజ్జికాయలూ, ఈ ఇనుప ముక్కలూ? ఇంకా పాతకాలంనాటి టిఫీన్లేనా?" అంటూ ప్లేట్‌ని పక్కనుంచేశాడు వేణు.

"మరి ఏం తీసుకుంటారు, బావగారూ?"

"అడిగి చేస్తారా ఏమైనా?"

"మీ అభిరుచులేమిటో, రుచులేమిటో తెలియవు కదా?"

బావమరిది మాటల్లో ఏదో వెటకారం ధ్వనించి, ముఖం గంటు పెట్టుకొన్నాడు వేణు.

"చెల్లాయ్: బావగారు గట్టిపదార్థాలు తినడానికి భయపడుతున్నారు. పళ్ళలో పటుత్వం అప్పుడే తగ్గిందా? బావగారిని ఆటపట్టిస్తున్నట్టుగా అన్నాడు.

"నా కిలాంటి జోకులు పనికిరావు!" వేణు చిర్రుమన్నాడు.

"ఆయనజోలికి వెళ్ళొద్దు, అన్నయ్యా! ఆయన అందరిలాంటి మనిషికాదు అకటావికటం మనిషి:" భర్త వినకుండా చెప్పింది అన్నగారితో, శ్యామల.

"ఇంటికి బావగారువచ్చే వేళాకోళాలు, నవ్వులు లేకపోతే ఏం సంతోషంగా వుంటుందే?.... బావగారు నిజంగా గట్టి పదార్థాలు తినరా?"

"అదంతా ఇక్కడ అత్తగారింట్లో తెచ్చిపెట్టుకున్న నాజూకు. అక్కడైతే మురుకులు చేయమని తల్లిని అడిగి చేయించుకొంటాడు. మురుకులు పంటి క్రింద ఎంత కరకరలాడితే అంత రుచిగా ఉంటాయంటారు."

అప్పటికప్పుడు ఉప్మా తయారు చేయించి తీసుకువచ్చాడు. స్పూన్ కోసం ఉప్మాలో కలుపుకొనే చట్నీకోసం మళ్ళీ పేచీ.

"ఉప్మాకి చట్నీచేసే అలవాటు లేదు, బావగారూ! పల్లెటూరి వాళ్ళం కాదా! రేపటినుండి జ్ఞాపకంతో అలాగే చేస్తాం!"

"మోటు మనుషులు మోటు తిళ్ళు," తిట్టుకొంటూ తిన్నాడు ఉప్మా. "వంటల్లో, ఫలాహారాల్లో కారం తగ్గించి వేయమను. అడవి మనుషుల్లా గొడ్డుకారం తినేట్టున్నారు వంటల్లో."

భర్త నాజూకులు పడటంచూస్తే ఒళ్ళు మండుకు వస్తుంది శ్యామలకు. తన అత్తగారింట్లోనూ తక్కువ కారమేమీ తినరు. పప్పులో వేసిన పచ్చిమిరపకాయలు, పోపులో వేసిన ఎండుమిరపకాయలు కరకర నమిలేస్తాడు. వంటల్లో ఏ మాత్రం కారం తగ్గితే "ఉప్పూకారం లేకుండా ఈ చప్పిడి వంటేమిటమ్మా?" అని రుసరుసలాడే ఈ మనిషి అత్తగారింటికి వచ్చి ఏం నాజూకులు పోతున్నాడు!

పండగ మూడురోజులూ ఒక కొరివితో తలగోక్కున్నట్టుగా అయింది వేణుతో. అల్లుడంటే ఉత్త పేచీకోరు అని నిర్వచనం చెప్పుకొనేలా ప్రవర్తించాడు. దేనికి కోపం వస్తుందో, ఎందుకు కోపం వస్తుందో తెలియదు.

"అడవి మనుషులం మేంకాదు, అతడు అనిపిస్తుంది. మీ ఆయన్ని ఇలా అంటున్నానని నువ్వు బాధపడకు. ఇలాంటి మనిషితో నువ్వు సుఖపడుతున్నావంటే అది వట్టి బూటకమనుకోవాలి. ఆరు నెల క్రిందా నువ్వు అత్తగారింటికి వెళ్ళి? అత్త ఎలాంటిది? మగడు ఎలాంటి వాడు? ఏమైనా ఒక్క ఉత్తరంలోనైనా వ్రాశావా? 'నేను క్షేమం. మీరు క్షేమమని ఆశిస్తాను. వ్రాయడానికి పెద్ద విశేషాలు ఏమీ లేవు. విశేషాలతో ఉత్తరం వ్రాయగలవు.'— నీ దగ్గరినుండి ఎప్పుడు ఉత్తరం వచ్చినా ఇంతేకథా?" అన్నాడు శ్యామల అన్న చంద్రమౌళి.

"కాళ్ళరిగేలా సంబంధాల కోసం తిరిగి, అందిన చోటల్లా అప్పులుచేసి, నన్నొక ఆయ్య చేతిలోపెట్టి తృప్తిగా ఒక నిట్టూర్పు విడవకముందే. "నా అత్తగారింట్లో నాకు సుఖంలేదు, నా భర్త అదోరకం మనిషి" అని వ్రాసి మీ గుండెల్లో నిప్పులు చల్లనా? నాబాధ ఏదో నేను పడాలనుకొన్నాను అన్నయ్యా. నా శక్తి మించిపోయిన రోజు, నాదిక్కు తోచనిరోజు మిమ్మల్ని తప్పకుండా గుర్తు చేసుకొంటాను. మీ సహాయం తప్పకుండా కుండా అర్థిస్తాను." శ్యామల ఎంత గంభీరంగా ఉండాలనుకొన్నా స్త్రీ సహజంగా కన్నీరు చిలికింది, "అమ్మతో, నాన్నతో నేనన్న మాటలేవీ చెప్పొద్దు. ఈ వయసులో వాళ్ళు తట్టుకోలేరు. తెలియక తప్పని పరిస్థితివస్తే అప్పుడు చూద్దాం."

పండగరోజు,

కూతుర్నీ అల్లుణ్ణీ పీటలమీద కూర్చోబెట్టి, ట్రేలో కొత్తబట్టలుంచి తీసుకు వచ్చిన శ్యామలతల్లి, "మా కున్నంతలో

## చీమలు-మనుషులు

స్నేహబంధాలు స్తంభించే రహదారి
ఎవరిసుఖాలు వాళ్ళే చూసుకునే
కుడిఎడమల రహదారిలో
మనమే గిరగిస్తున్నాము
స్నేహదారిద్ర్యపు రేఖలను
తమ చిన్నారిలోకంలో
మట్టి స్వభావాన్ని వ్యక్తంచేసేచీమ
పల్కరించుకుంటాయికనీసంపరస్పరం
దారిలో అనాయాసంగానే ఆగి
కలసిమోస్తాయి కష్టసుఖాలబరువుల
నిర్మిస్తాయి నిరంతరంస్నేహవారధు
ఇచ్చిపుచ్చుకునే యధార్థమొక్కటే
ఆత్మీయతను అతికించదు
గుండెలోని అవ్యక్తమైన అనుబంధం
మనుష్యులమధ్య పెరిగేమంచిసంస్కారం
మార్పుకోసం సాహసించే స్నేహం
అనుబంధమే యేడతెగని ఆత్మబంధం

నిఖిలేశ్వర్

తెచ్చాము. ఏమీ అనుకోకండి, అల్లుడు గారూ. ఈసారి కొంచెం చేయితిరిగితే మంచి బట్టలే తేస్తానన్నారు మీమామగారు" అంది ముందుగానే బిడియంగా, భయంగా.

ట్రేలో సూటుగుడ్డలకు బదులు పంచెల చాపుచూసి బాణంలా లేచిపోయాడు వేణు. నేనేంగడెం తోలేవాణ్ణికాదు. పంచె కట్టుకు ఊరేగడానికి. లేకపోతే లేనట్టు ఊరుకోండి. పెట్టమని ఏడ్చిందెవడు?

"ఏదో.... మాలాంఛనం...." వణుకుతూ ఏదో చెప్పబోయిందావిడ.

సూటూ బూటూ వచ్చాకకూడా పంచెల లాంఛనం ఏమిటి?"

చివరికి శ్యామల ఒక్కటే పెట్టుకుంది కొత్తచీరా జాకెట్లను. అవి భర్త తీసుకోవద్దని శాశించినా, తల్లివాళ్ళు బాధపడతారని తీసుకొంది.

బయల్దేరబోయే ముందు వేణు అడిగాడు శ్యామలను. "వచ్చేప్పుడు అమ్మ చెప్పినవి అడిగావా?"

"వాళ్ళ పరిస్థితి చూసి అడగాలనిపించలేదు."

"మనమూ లక్షాధికార్లం కాదుకదా, వచ్చేవి విడిచి పెట్టుకోవడానికి?"

"వచ్చేవి అంటే? ఎలా వస్తాయి? మనం ఎప్పుడైనా బాకీ ఇచ్చామా?"

"పెళ్ళిలో ఇస్తామన్నవి ఇచ్చేవి కాదా? మాట ప్రకారం అవి బాకే."

"పెళ్ళిలో గొడవ కాకూడదని మీరడిగిన వాటికల్లా తలూగించారు. ఇస్తామన్నవన్నీ ఇవ్వడానికి వాళ్ళదగ్గర తేరగా డబ్బులేదు. వాళ్ళ సంసార పరిస్థితులేం బాగాలేవు. చూస్తూ అడగడానికి నేను కూతుర్నే కాని రాక్షసిని కాదు. అంత బాధగావుంటే మీరే అడగండి." ఖండితంగా చెప్పేసింది శ్యామల.

"మీవాళ్ళని మప్పు అడగాలి. నేనేలా అడుగుతాను?"

"ఆడకూతురినై పుట్టి వాళ్ళని పెట్టిన కష్టాలు చాలు. ఇక ఒక్క నయాపైసా కూడా వాళ్ళనుండి నేను పుచ్చుకోదలచలేదు."

వేణుకు పట్టలేని కోపం వచ్చేసింది. "బయల్దేరింది ఆదర్శ మహిళ. పదపద, అమ్మ చీపురు తిరగేస్తుంది నీ తిక్క వేషాలు చూసి."

"అమ్మ చీపురు తిరగేస్తే మీరు చెప్పు తిరగేస్తారా?"

"నువ్వు హద్దులో ఉన్నంతవరకు నేను మంచివాడినే. హద్దులు దాటితే నాఅంత చెడ్డ మనిషి లేడని తెలుసుకో. నాలో సంస్కారం నిలవడం, పోవడం నీ ప్రవర్తన మీద ఆధారపడుతుంది." వార్నింగ్ ఇస్తున్నట్టుగా అన్నాడు వేణు. "పంచెలు మిగిలాయని వాళ్ళను సంబరపడొద్దని చెప్పు. సూట్ కోసం ఎనిమిది వందలు ఎమ్.ఒ. చేయమని చెప్పు."

"చెప్పడానికి నాకు నోరు రాదు!"

"మొగుడి మంచిని కోరని నువ్వేం ఆడదానివి!"

"ఏమైనా అనండి. ఏమైనా చేయండి. నేను మాత్రం వాళ్ళని పీడించడానికి ఒప్పుకోను!"

"సరే పద! నీ సంగతి అక్కడికి వెళ్ళాక చూస్తాను! ఏం జరిగినా నన్ను దుష్టుడిగా మారుస్తున్నది నువ్వేనని గుర్తుంచుకో!"

o o o

పుట్టింటివాళ్ళు శ్యామలకు పెట్టిన చీర చూసి ముక్కు మీద వేలుంచుకొంది అత్తగారు. "పట్టు చీరకాదు, ఆఖరికి పాలిస్టరు చీరైనా కాదు! వాయిల్ చీర! అది పెట్టుకు తెచ్చుకోవానికి నీ కెంత సిగ్గు లేక పోయింది?"

"పుట్టింటి వాళ్ళు ప్రేమతో పెట్టింది. తెచ్చుకోడానికి సిగ్గెందుకు?"

"వాడికి పంచెలు తెచ్చారా? ఆఫీసుకు బయటికి 'మా అత్తగారు పెట్టిన నూతన వస్త్రాలివిగోండి' అని కట్టుకు ఊరేగుతాడనుకొన్నారా మీ వాళ్ళు?"

"మీ వాళ్ళు మీ వాళ్ళు అంటారు! నా వాళ్ళెప్పుడు మీరా? వాళ్ళా? ముందు తేల్చండి!"

"ఏమిటో కొమ్ములు మొలిచినట్టుగా మాట్లాడుతున్నావే?"

"మరి ఎంతకని విని ఊరుకోమంటారు? ఎప్పుడూ మా పుటింటివాళ్ళను ఆడి పోసుకోవడమేకదా? ఎంతకని సహించమంటారు?" మొండికెత్తినట్టుగా అంది శ్యామల.

"తిరుగు బాటు చేస్తున్నానని గర్వంగా ఫీలవుతున్నావేమో! ఇది తిరుగు బాటు కాదు తిక్కరోగం! ఆ తిక్కరోగం ఎలా కుదర్చాలో మాకు తెలీదనుకోకు?" అన్నాడు వేణు.

"అయితే ఏం చేస్తానంటారు? ఎదురింటి ఊర్మిళను అత్తా, మొగుడు కొట్టి చంపినట్టుగా నన్నూ కొట్టి చంపుతారా?"

"ఎవరు కొట్టి చంపారు? అదే ఉరి పెట్టుకు చచ్చింది తిన్నది అరక్క!"

"నన్ను కొట్టి చంపి మీరూ అదేమాట చెబుతారన్నమాట ప్రపంచానికి?"

"ఏమిటే పిచ్చికుక్కలా వదురుతున్నావు?" చెయ్యెత్తి పైపైకి వచ్చాడు వేణు.

"ముందు ఆ చెయ్యిదించండి! మీరు చెయ్యి చేసుకొనేంత తప్పు నేనేం చెయ్యలేదు!" నిప్పులు కక్కుతున్నట్టుగా చూసింది శ్యామల. "నన్ను కొట్టడానికి,

## నూనె దివ్వెలు!

తల్లిని గుర్తుపడుతున్న
పురిటి కందులా-
ఇన్ని విద్యుద్దీపాల మధ్య
ఈ వేళ- ఈ నూనె దీపం
చీకటిని చూసి నవ్వుతూవుంది!
తను ఆధారంగా
వెలుగు వెల్లువై
నిశ్శబ్దం ప్రబద్ధలై
నరకం తొలగి స్వర్గం చివురిస్తుందని
నమ్ముతూ వుంది!
పాపం!
మధ్య తరగతి బ్రతుకులా పసితనం!
తన చుట్టూ తల్లి వాడిలా చీకటి!
తన మీద వాగ్దానంలా వీచే గాలి!
నిజానికి- తన పుట్టుక
చీకటి కంటికాక వెలుగు సూడిద!
కానీ- తెల్లారితే ఏముంది?
ప్రతి గడప ముందు
కావల్సినంత కోర్కెల బూడిద!!

—ఆచార్య తిరుమల

చంపడానికి నన్ను మీకు ధార దోయలేదు మా నాన్నగారు! పెళ్ళి అంటే ఆడదాన్ని మగవాడు పీడించడం, హింసించడం కాదు! సహచరులంగా, ఒకరికి ఒకరు తోడుగా నీడగా జీవితం సాగడానికి ఏర్పడేది వివాహం! నా భార్య, నేను చంపు కొంటాను, వరుక్కుంటాను అనడానికి మీకేమీ హక్కు లేదు!"

"పండక్కి పుట్టింటికి వెళ్ళొచ్చాక చాలా మారిపోయిందేమిటిరా? ఇదివరకు

ఇలా లేదు! వాళ్ళేదో నూరిపోసి పంపించారులా ఉంది. నువ్వు మెత్తగా అంటే మొత్తేస్తుంది చూడు. వియ్యంకుల నుండి మనకు రావలసిన లాంఛనాలు అడిగితే దానికెందుకట మధ్యన ఉలుకు?" కొప్పెక్కి పురి ఎక్కిస్తున్నట్టుగా అంది తాయారమ్మ.

"దీని పొగరణచకపోతే నేనేం మగవాడినమ్మా? దీన్ని కొడతాను! నరుకుతాను! ఎవడొచ్చి అడుగుతాడో చూస్తాను!"

"ఊర్మిళ పుట్టింటి వాళ్ళలా వెర్రి బాగుల వాళ్ళు కాదు మా పుట్టింటివాళ్ళు! ఏదేనా జరిగితే మీకూ ఆవిడకీ ఉరిశిక్ష వేయించే దాకా వదలరు! మా చంద్రమౌళి అన్నయ్యంటే ఏమిటనుకొన్నారో? రక్తానికి రక్తం అంటాడు. వాడు ఇలాంటి నాటిలో చాలా పట్టుదలమనిషి."

"ముందు నిన్ను తన్ని తరిమేస్తాను! చూస్తాను, అడగడానికి ఎవడొస్తాడో?"

"మనుషు లెవరూ రారు! యమకింకరుడే వస్తాడు?"

"ఓహో! మీ అన్నయ్యేనా ఆ యమకింకరుడు? మంచి పేరే పెట్టుకొన్నావు!" వెటకారంతో నవ్వసాగాడు వేణు.

o o o

శ్యామలకు రోజులు దుర్భరమౌతున్నాయి.

రావలసినవి అడగకుండా వచ్చిందని, వచ్చినప్పటి నుండి పప్పులో మిరపకాయలూ, ఉప్పు వేసినట్టుగా చిటపటలాడి పోతున్నారు శ్యామల మీద అత్తా మగడూ!

దినమొక యుద్ధం!

ఒక్కోసారి చేయి కూడా చేసుకొంటున్నాడు వేణు.

"చక్కగా మా అన్నయ్య కూతుర్నిస్తానంటే చేసుకోలేదు. దానికి కాస్త మెల్లకన్ను ఉందని. తండ్రి సంపాదించిన లక్షలాస్తీ దానికే అయ్యేది. ఏం అందగత్తె వచ్చి ఏం ఒరగబెట్టిందని?... ఇప్పటికీ తన కూతుర్ని చేసుకోలేదని ఎంత బాధపడిపోతున్నాడో మా అన్నయ్య. ఇది ఏమిటో తెగనవుగుతుంది. దీనిపీడ పుటుక్కున విరిచేసుకొంటే...." ఇలా సాగుతుంది తాయారమ్మ స్వగతం.

ఒకసారి జుట్టి మెడపట్టి గుమ్మంబైటికి పెట్టి తలుపులు మూసేశాడు వేణు.

"వెళ్ళు. వెళ్ళదిక్కున్న చోట చెప్పుకోపో!"

సాధ్యమైనంతవరకు పోరాడి అలసిపోయినదానిలా పుట్టిల్లు చేరుకొంది శ్యామల.

అష్టకష్టాలుపడి ఆడపిల్లకు పెళ్ళి చేసి పంపితే లాంఛనాలనీ అవనీ ఇవనీ పేచీ పెట్టుకు తరిమి వేస్తే కన్నవాళ్ళ హృదయాలు ఎలా అవుతాయి? అల్లుడంటే రక్తం పీల్చే జలగలా ప్రవర్తించడమా? ఆ మనస్తాపం వాళ్ళకు కలిగించకూడదనే శ్యామల ఇన్నాళ్ళూ మనసు బిగబట్టుకొని నిత్యనరకమనిపించే అత్తగారింట్లో ఉంది!

అమ్మాయి జీవితం ఇలా అయిపోయిందేమని కొన్నాళ్ళు బాధపడ్డారు శ్యామల తల్లిదండ్రులు. తరువాత, ఇలా ఎన్నాళ్ళు ఆడపిల్లను అట్టే పెట్టుకోవడం అన్న ఆలోచన! ఎవరింట్లో వాళ్ళుంటేనే అందం, కష్టమైనా, సుఖమైనా!

"వాళ్ళకు ముట్టాల్సినవి నేను నా పిల్లలు కూలినాలి చేసి అయినా డబ్బు కూడబెట్టి త్వరలో ముట్టజెప్పుతాన నచ్చజెప్పుతాను, పదమ్మా!" అన్నాడు ఒకనాడు, తండ్రి.

"మనమిచ్చే కానుకలకు మన పిల్లను ఎన్నాళ్ళు బాగా చూసుకొంటారు నాన్నా? మంచితనం అనేది మనిషిబుద్ధిలో ఉండాలి అంతేగాని, వాళ్ళు మనపిల్లను మంచిగా చూసుకోవాలని ఎన్నాళ్ళు ఎన్నని ఇస్తుంటాం" అన్నాడు చంద్రమౌళి. అతడికి అప్పటికప్పుడు వెళ్ళి బావగారికి నాలుగు తగిలించి వద్దామని ఉబలాటంగా ఉంది గాని దానివల్ల మరీ చెల్లెలి జీవితం నాశనమౌతుందేమోనని భయంగా ఉంది.

తండ్రి తనని ప్రయాణం చేయిస్తుంటే "వాళ్ళు నన్ను చూస్తూనే మండిపడుతున్నారు, నాన్నా. చంపడానికైనా సిద్ధంగా ఉన్నారు. వాళ్లకో మేనరికం పిల్ల ఉందట నన్ను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నట్టున్నార." కళ్ల నీళ్లు పెట్టుకొంది శ్యామల.

"చంపితే ఒకేసారి చంపుతారు కదమ్మా? ఇలా భర్త వదిలేసిన ఆడదానిలా పుట్టింట్లో దినదినం చచ్చేకంటే అది నయం కదూ?"

"నాన్నా!"

o o o

"అక్కగారూ! నువ్వు నీ కూతుళ్లని కన్నట్టుగానే నేను శ్యామలని కన్నానమ్మా నీకు నీ కూతుళ్ళెంత ప్రాణమో నాకూ ఆ పిల్ల అంతే. శ్యామలని మీరు పెట్టిన బాధలే మీపిల్లలని అత్తగారిళ్ళలో పెడితే?"

"ఏం బాధలు పెట్టామూ? మాకు రావలసినవి అడగడం కూడా బాధలు పెట్టడమే?"

"నేను ఇవ్వాల్సినవన్నీ ఇస్తానమ్మా. కాస్త చేయితిరిగే వరకు ఓపిక పట్టండి."

"అవి తెచ్చాకే నీ కూతుర్ని కాపురానికి తీసుకురావయ్యా. అంతవరకూ ఆమెతో మాకు పనిలేదు."

"ఏం మాటలివి అక్కగారూ? ఒకింటి పిల్లను కోడలిగా తెచ్చుకొన్నాక ఆమె పుట్టింటి వాళ్లేవో కానుకలూ, లాంఛనాలూ ఇవ్వలేదని ఆ పిల్లతో పనిలేదంటారా? మీ కొడుకు కాపురం చేసేది మా పిల్లతోనా, మేమిచ్చే కట్నకానుకలు లాంఛనాలతోనా? ఇంత నీచమైన బుద్ధి ఉన్నవాళ్లు, అవి ముట్టినా సజావుగా పిల్లను చూసుకొంటారని గ్యారంటీ ఏమిటి?" ఈ మాటలు పైకి అనలేదు శ్యామల తండ్రి. మనసులోనే స్వగతంగా, మంటగా అనుకొన్నాడు. మంచి మాటలతో కూతురి కాపురం చక్కబెట్టడానికి వచ్చాడాయె.

సాధ్యమైనంత త్వరలో వాళ్ళకు ముట్టాల్సినవి ముట్టిస్తానని పదేపదే చెప్పి కూతుర్ని దిగవిడిచి వెళ్ళాడాయన. అమ్మాయినేమీ ఇబ్బంది పెట్టొద్దని మరీ మరీ అర్థించి వెళ్ళాడు. కాని, ఆయన గుండెలు పీచుపీచుమంటూనే ఉన్నాయి, రాబందులమధ్య పిచ్చుక పిల్లను వదిలేసి వెడుతున్నట్టుగా.

కాని, ఆడపిల్ల తండ్రి,

అంతకు మించి గత్యంతరం లేదు.

పెళ్ళయిన పిల్లను మగణ్ణి విడిపించి ఇంట్లో పెట్టుకొంటే ఎన్ని సమస్యలు! ఎన్ని అపవాదులు!

o o o o

ఆ రోజు ఆదివారం వేణు ఇంట్లో ఉన్నాడు.

వేసవి మధ్యాహ్నం.

ఆపసోపాలు పడుతున్నాడు గదిలో.

"మీ నాన్న ఫాన్ ఇచ్చేసరికి ఎన్ని వేసవిలు గడిచిపోవాలో?" అన్నాడు భార్యతో.

శ్యామల దానికి జవాబివ్వకుండా, "ఇవాళ పేపరులో ఈ వార్త చూశారా? అతడు రోజు తాగొచ్చి భార్యను చావ బాదేవాడట! దెబ్బలకి విసిగిపోయి ఆవిడ రోకలిబండతో అతడి తల పచ్చడిచేసేసిందట, అతడు నిద్రపోతున్నప్పుడు!" అంది.

"ఇప్పుడు ఆ వార్త సంగతి ఎందుకట?"

"నిన్నటి పేపరు చూశారా? కట్నం డబ్బుతేలేదని రోజూ వేధించే వాళ్ళ ఆ అమ్మాయిని, ఓ రోజు ఆ అమ్మాయికి ఒళ్ళుమండుకుపోయి, మగడూ అత్త పడుకోగా చూసి ఇద్దరి మీదా కిరోసిన్ పోసేసి తగలబెట్టేసిందట!"

వేణు ముఖ కవళికలు పూర్తిగా మారిపోయాయి. "నీ తల్లో ఏదో పురుగు తొలుస్తూన్నట్టుందే. నువ్విలా మమ్మల్ని తగల బెట్టేయాలనుకొంటున్నావా?"

"రామ రామ! పత్రికల్లో వచ్చిన వార్త చెబితేనే అంత ఉలికి పాటా? మిమ్మల్ని తగలబెట్టి నా కాపురం నేనే తగులబెట్టు కొంటానా? అదెవత్తో పిచ్చిది. అలా చేసింది."

"నీకు అలాంటి పిచ్చేదో పడుతున్నట్టే ఉంది, పిచ్చి ముదరక ముందే నేనే పిచ్చి కుదురుస్తాను."

"ఇంట్లో నాకేం తోచక నిజంగా నేనే పిచ్చిదాన్ని అయిపోయేట్టున్నాను కుట్టు సెంటర్ దగ్గరేగా? వెళ్ళి కటింగ్ నేర్చుకోనా? పని నేర్చుకున్నట్టూ, కొంచెం కాలక్షేపం అయినట్టూ ఉంటుంది"

"నేర్చుకొని ఏం చేస్తావు? దర్జీపని చేస్తావా?"

"మీరు అన్నిటికీ ఇలా ఎగతాళి చెయ్యడం బాగా లేదు. కుట్టు పని ఒక్క దర్జీ వాళ్లే చెయ్యడం లేదు ఈ కాలంలో."

శ్యామల కొంచెంవిసుక్కొంది. 'కటింగ్ నేర్చుకొని ఒక మిషన్ తెచ్చేసుకొంటే కనీసం ఇంటిబట్టలైనా కుట్టుకోవచ్చు. ఇప్పుడు ఎంతమంది గృహిణులు వేణ్ణీళ్ళకు చన్నీళ్ళన్నట్టుగా గడపడం లేదు?"

"ఓహో. నేనుండగానే నువ్వు ఇల్లు గడిపేదానివి అవుతావన్నమాట."

"ఎందుకండీ, ఇలా పెడర్థాలు తీస్తారు?" శ్యామల మాట మాట కన్నీళ్లు రావు. కళ్ళలో నిప్పురవ్వలు లేస్తాయి! ఆ రవ్వలనీ, ఆ పొగరునీ చూస్తే చాలు వేణూ, తాయారమ్మా మరింతగా రెచ్చిపోతారు.

ఈ సంగతి అత్తగారికి ఆఘమేఘాల మీద పయనించింది. "కటింగ్ నేర్చుకొంటే ఏమిటిదేగా? తిని పుస్తకాలు, పత్రికలూ తిరిగేసేకంటే ఒక వ్యాపకమన్నా ఉంటుంది!" ఎదురింటి పద్మాక్షి సెంటరుకి వెళ్ళి కటింగ్ నేర్చుకొని, మహిళామండలినుండి ఓ మిషను కూడా తెచ్చుకొంది. రాత్రీపగలు కుట్టినా ఒడవని బట్టలు వస్తున్నాయి. మిషను మీద కాళ్ళు ఆపకుండా కుట్టి కుట్టి ఆరుమాసాల్లో మిషను అప్పు తేర్చేసి నాలుగు తులాల పుస్తెల తాడు చేయించి వేసుకొంది మెడలో, పచ్చగా! అత్తగారికి ఆ క్షణం పద్మాక్షి జ్ఞాపకం వచ్చేసి కోడలు కుట్టు నేర్చుకోడానికి వెంటనే ఒప్పేసుకుంది.

"ఆవిడ దరఖాస్తుమీద నీ అనుమతి ముద్ర పడ్డాక నేనేంచేస్తాను? సరే" అన్నాడు వేణు.

o o o

ఆరోజు మహిళామండలి మీటింగ్. శ్యామల వెళ్తున్న కుట్టు సెంటరు దానికి అనుబంధంగానే నడుస్తూంది. మహిళా మండలి ప్రెసిడెంట్ వరలక్ష్మి, సెక్రటరీ ఇందిర శ్యామలకిబాగా పరిచయమయ్యారు తన ఇంటి పరిస్థితులు ఒకరోజు వాళ్ళతో వెళ్ళబోసుకుంది శ్యామల.

ఈరోజు మీటింగ్‌లో వరకట్నాల గురించి. వరకట్నాల కారణంగా అబలల బలి గురించి చర్చిస్తున్నారు.

"ఎప్పుడో వాళ్ళు నన్ను చంపేస్తారేమో? చంపితే బాధలేదు. అది ఆత్మహత్యగానో, సహజ మరణంగానో ప్రపంచాన్ని నమ్మిస్తేనే నాకు బాధ?" అంది శ్యామల, తన పరిస్థితి ప్రస్తావించి "నేను చస్తే అది హత్యఅని నిరూపిస్తారు కదూ?" అని అర్థించింది.

"ఆధారాలు కావాలిగా?"

"ఎందుకయినా మంచిది. నేను ఒక లెటర్ వ్రాస్తాను మీకు. అదే మీకు పెద్ద ఆధారమయ్యేట్టు."

"అధారం ముందే తప్పకుండా పోరాడతాం. మా ఆయన క్రిమినల్ లాయరు. మా సిస్టరు కూడా లాయరే." వరలక్ష్మి అంది ఉత్సాహంగా.

"అదేమిటి? ఆ అమ్మాయి చచ్చిపోవడం భయమన్నట్టుగా, భరోసా ఇస్తున్నావు?" ఇందిర వింతగా అంది.

"పత్రికలలో ఎన్ని ఘోరాలుచదవడం లేదు? వరకట్నపు రాక్షసికి మరో అతివ బలి." వరకట్నపు కోరలకు మరో గృహిణి ఆహుతి" అంటూ రోజూ ఎన్ని వార్తలు."

శ్యామల అంది, "పత్రికలలో వార్తలు వదిలిపెట్టండి. నేను కాపురానికి వచ్చిన కొత్తలో మా ఎదిరింట్లో జరిగిన సంఘటన! ఊర్మిల అని తల్లిదండ్రులకు వొక్కతే కూతురు. తమ తదనంతరం ఆస్తి అంతా కూతురిదే అన్నట్టుగా మాట్లాడి పెళ్ళి చేశారు. తీరా పెళ్ళయ్యాక ఊర్మిళ తల్లికి కొడుకు పుట్టాడు. అప్పటినుండి ఊర్మిళకి కష్టాలు మొదలయ్యాయి అత్తగారింట్లో. ఎప్పుడూ ఆ అమ్మాయిని పుట్టింటికి తరిమి వేయడమే. ఆస్తి రాయించుకు రమ్మనో! స్కూటర్ కావాలి డబ్బు తెమ్మనో, టి.వి. కావాలనో-ఏదో వొకటి. విసిగి నాలుగు సంవత్సరాలపాటు పుట్టింట్లోనే ఉండిపోయింది. చివరికి తల్లిదండ్రులు తీసుకొచ్చి వదిలేసి వెళ్లారు. "సగం ఆస్తి రాసిఇస్తాము. అమ్మాయి నేమీ బాధపెట్టకండి" అని చెప్పి కాని. అత్తగారు పాతపాట మొదలుపెట్టారు. నీ తమ్ముడికి ఏవిషమో పెట్టి చంపెయ్యి. ఆస్తి అంతా మనకి వస్తుంది." అని కొత్తగా పోరు మొదలుపెట్టారు. ఊర్మిల యెదురు తిరిగింది.

"ఆరోజు రాత్రి ఏడుగంటలు దాటిందేమో. వీధిలో అందరం చూస్తున్నాం. ఆ అమ్మాయిని మొగుడూ, అత్తగారు ఇద్దరూ కొడుతూంటే దెబ్బలకి తాళలేక బయటికి పరిగెత్తుకు వచ్చింది. ఇరుగు పొరుగంతా పోగయి ఆడకూతుర్ని అలా కొడతారేమిటని మగణ్ణీ, అత్తనీ చివాట్లు వేశారు. ఊర్మిల ఇంట్లోకి వెళ్ళాక ఏం జరిగిందీ తెలియదు తెల తెలవారుతూంటే ఆ ఇంట్లోంచి చావుకేకలు మొదలయ్యాయి.

"ఊర్మిల చాపమీద చచ్చిపడిఉంది ఆమె ఉన్నగదిలోనే దూలానికి చిన్నరాడు ముక్క ఉరివేసుకున్నట్టుగా వేలాడుతుంది. ఎస్సై వచ్చాడు. అదీ ఆత్మహత్య కేసు క్రింద నమోదు చేసుకొన్నాడు. ఊరిజన

మంతా కదిలివచ్చి చెప్పారు. అది ఆత్మహత్య కాదు హత్యని. ఊర్మిళ అత్తగారినుండీ ఎంత దెబ్బ తిన్నాడో అది ఆత్మహత్యే అన్నాడు ఆ పిల్ల ఒళ్ళంతా వాతలు కప్పిస్తున్నా తల్లిదండ్రులు వచ్చారు భోరుని ఏడ్చారు. కూతురిది హత్య అని నిరూపించడానికి నానా యాతనపడ్డారుగాని ఎక్కడికి వెళ్ళినా న్యాయం జరగలేదు. ఎక్కడికి వెళ్ళినా వీళ్ళకంటే ముందే వాళ్ళ డబ్బుతో వెళ్ళారు కాబట్టి, వాళ్ళకి కడుపు శోకం తప్ప ఇంకేం మిగలలేదు. ఇప్పుడు ఊర్మిళభర్త మళ్ళీ పెళ్ళికొడుకవుతున్నాడు ఇరవై వేల కట్నంతో వచ్చేనెలలో పెళ్ళి."

"అబ్బా! ఎంత ఘోరం! ఎంత అన్యాయం." శ్రోతలందరూ అప్రయత్నంగా అన్నారు.

ఇందిర ఆవేశంగా అంది. "ఇలాంటి చావులకు కారణం అత్తగారూ, మొగుడూ వీళ్ళే అవకూడదు. ఇందులో తల్లిదండ్రులకూ బాధ్యత ఉంది. సమాజానికి బాధ్యత ఉంది. చంపినా సరేకాని మీ ఇంట్లోనే ఉండాలి పిల్ల అని అత్తగారింట్లోకి నెట్టి వెడరారే తల్లిదండ్రులు. ఈ కూతురు చస్తే ఆ చావులో వాళ్ళకు భాగం లేదా? సంప్రదాయం. గౌరవం అన్న సంకెళ్ళలో చిక్కుకొని, కడుపుతీపి కూడా చంపుకొని కూతుళ్ళని అలాంటి రాక్షసుల మధ్య వదిలేస్తున్నారంటే- నేరం కొంత వాళ్ళదికూడా. తమ మధ్య ఒక ఆడపిల్ల హింసింపబడి, హత్య చేయబడుతుంటే - అంటే ఈ ఊర్మిళ హత్యనే తీసుకుందాం. దెబ్బలకి తాళలేక బయటికి వచ్చిందన్నావే! అప్పుడు ఇరుగు పొరుగులు అతని మొగుడిని చీవాట్లు వేశారన్నావుగాని ఒక్కరికైనా ఆ అమ్మాయికి తగిన రక్షణ కల్పించాలన్న ఆలోచన వచ్చిందా? ఒకింటి విషయాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని లౌక్యం మనది. ఇప్పుడిప్పుడే ప్రభుత్వంలో ఒక ప్రతిపాదన బయల్దేరింది. ఆడపిల్లకు పెళ్ళయాక అయిదేళ్ళలో చనిపోతే. అది కేస్‌గా బుక్ చేసి ఆమె చావుకు కారణాలు దర్యాప్తు చేయాలని. అది దక్కగ ఆలోచనే. డబ్బుకు గడ్డితినే అధికారులు ప్రభుత్వంలో ఉన్నంతవరకు అసలు కారణాలు ఎక్కడ వెల్లడి అవుతాయి? ఈ ఊర్మిళ హత్యలాగే.

"ఇప్పుడు ఈ వరలక్ష్మి చూడు. నువ్వు చచ్చాక నీకేసు తీసుకొని నీఆత్మకు శాంతి చేకూర్చేందుకు తన భర్త లాయరు తన చెల్లెలు లాయరని చెబుతుందేగాని తగిన రక్షణ కల్పిస్తానని చెబుతుందా?"

"మనం ఎలా ఆ అమ్మాయికి రక్షణ కల్పిస్తాము? వాళ్ళ అత్తకీ మగడికీ ఏమైనా చెప్పబోయామనుకో! "మీరెవరు చెప్పడానికి? మాయింటి వ్యవహారాల్లో మీరు కలదూర్చడమేమిటి? అనరూ?"

"అలా అనే పరిస్థితే పోవాలి. మనుషులమంతా ఒక సమూహంగా, సమాజంగా బతుకుతున్నాం. మనలో ఒకమ్మాయి పుట్టింటి వాళ్ళివ్వని కట్నకానుకల కోసం బాధింపబడుతూంటే, మనమధ్యే హత్యకు గురికాబోతూంటే ఇదేమిటని అడిగే అధికారం ఎందుకు లేదూ? మనం ఒకసారి వాళ్ళింటికి వెడదాం. శ్యామలకేమేనా జరిగితే మేం కేసు పెడతామని చెప్పాలి. వాళ్ళింకా ఆ అమ్మాయిని హింస పెట్టేట్టయితే, ఆమెను బయటకి తీసుకువచ్చి ఆమె బ్రతుకు ఆమె బ్రతికేలా మనం ఆధారం కల్పించాలి."

"ఇలా ఎందరికని ఆధారం కల్పించగలం?"

"ఈ నిస్పృహే కూడదంటాను ఒక మంచిపనికి ముందు. ఎందరికంటే, వీలైనంత మందికి అంటాను. ఇలాంటి అభాగినులకోసం కొన్ని స్వచ్ఛంద సంస్థలు వెలియాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఏం చేయలేదు. ఎంతటి పటిష్టమైన చట్టాలు రూపొందించినప్పటికీ, ప్రజల సహకారం ఉండదు కాబట్టి, కట్నం ఇవ్వడం నేరం. పుచ్చుకోవడం నేరం చట్టప్రకారం, కాని, కట్నం లేకుండా ఒక్క పెళ్ళి అయినా అవుతుందా? పిల్లకి మంచి సంబంధం చేయాలన్న తాపత్రయంతో, శక్తికిమించిన కట్నకానుకలు ఒప్పుకోవడం, ఒప్పందం ప్రకారం ఇవ్వలేక ఆడపిల్లకు అత్తవారింట్లో నరకంకల్పించడం. కట్నం ఇచ్చేపద్ధతి ప్రతి ఆడపిల్ల తండ్రీమానేయగలిగితే, కట్నపుకోరల్లో ఆడపిల్లలు చిక్కుకునే పరిస్థితి ఎంతమాత్రం రాదుకదా? అసలు ఆడపిల్ల తనను తాను రక్షించుకోగల స్థితికి ఎదగాలంటాను. అమాయకంగా అసమర్థంగా మొగుడి చేతిలోనో, అత్తమామ చేతిలోనో చచ్చిపోవడం "అయ్యో పాపం" అనిపించదు నాకు. అలాంటి పరిస్థితులు కనిపించగానే వాళ్ళనుండి తెగదెంపులు చేసుకు బయటపడాలి. లేకపోతే ఉండి వాళ్ళ పొగరణచాలి. కాని. వాళ్ళ చేతిలో ఒక కోడిలాగానో, మేకలాగానో చచ్చిపోవడం ఎందుకు?"

"నాకు వచ్చే ఆలోచనలు కూడా సరిగా అవే." శ్యామల ఉత్సాహంగా అంది, "వాళ్ళ చేతిలో చచ్చిపోవడం ఉత్త చేతకానితనం అనిపిస్తుంది. కాని, తెలిసి కూడా ఏం నేనేం చేయగలను? చచ్చినా, బ్రతికినా ఇక్కడే నీ చోటు అని వదిలేసిపోయాడు మా నాన్న. వాళ్ళతో తెగదెంపులు చేసుకొని బయటికి నడవటానికి నాకు వేరే ఆధారం లేదు, ఏ ఆశయం లేకుండా ఒక గృహిణి రోడ్డు మీదికి నడిస్తే ఈ సమాజం స్వాగతం ఎలా చెబుతుందో మీకు తెలుసు. అలాంటి స్వాగతం కంటే ఆ మొగుడి చేతిలో చచ్చిపోవడమే నయమంటాను. ఇప్పుడు చెప్పండి, నాలాంటి ఆడపిల్ల ఏంచేస్తే బాగుంటుంది?"

అక్కడున్న అందరికేసీ ప్రశ్నార్థకంగా చూసింది శ్యామల.

అందరి వదనాలు ఆలోచనలతో నిండిపోయాయి.

ముందు ఆడపిల్ల కట్నం ఇచ్చి చేసుకొనే పద్ధతి పోవాలి.

ఆ పద్ధతి పోవాలంటే ఏంచేయాలి?

కట్నం ఇస్తామని పూర్తిగా ఇవ్వలేక, ఏదో పెళ్ళి అయిందనిపిస్తే ఆ ఆడపిల్లకు అత్తవారిల్లు యమచెర అవుతే - ఆ పిల్లకు విముక్తి ఎలా కలిగించాలి?

○ ○ ○

నేనిక శ్యామల ఏమౌతుందో. మీటింగ్‌లో తీర్మానం ఏంచేశారో చెప్పదలుచుకోలేదు. ముగింపు పాఠకుల ఆలోచనలకే వదిలిపెడుతున్నాను. కాని, ఒక్కటి చెప్ప దలుచుకొన్నాను, ప్రతి ఆడపిల్లతండ్రి తన కూతురికి కట్నమిచ్చి పెళ్ళిచేయనని ప్రతిజ్ఞ పూని, ఆ ప్రతిజ్ఞకు కట్టుబడితే శ్యామల లాంటి, ఊర్మిల లాంటి కథలు అసలు మొదలే కావని. ❊